క్లుప్తంగా

వెంకన్నకు చందన అభిషేకం


వెంకన్నకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: వెంకటాద్రిపై శుక్రవారం వేంకటేశ్వరస్వామికి అష్టోత్తర శత కలశాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామికి చందన అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం

సబ్బవరం: మండలంలోని ఓటర్లంతా తమ ఓటర్ గుర్తింపుకార్డులకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవడంతో పాటు ఓటర్ కార్డులను నవీకరణ చేయించుకోవాలని ఎంపీడీవో రమేష్ నాయుడు శుక్రవారం తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. వలంటీర్లు,సచివాలయ సిబ్బంది ఫాం-6బితో ఇంటింటికీ వెళుతున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరుకు ఈ ప్రక్రియ పూర్తిచేయనున్నట్లు పేర్కొన్నారు.

వేలం ద్వారా రూ. 10.71 లక్షల ఆదాయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పలు వ్యాపారాల నిమిత్తం నెల కాలపరిమితికి శుక్రవారం నిర్వహించిన వేలం పాటల ద్వారా రూ.10 లక్షల 71వేలు ఆదాయం లభించింది. కొండదిగువ భైరవస్వామి ఆలయం వద్ద పూజాసామగ్రి, కొబ్బరికాయలు విక్రయానికి రూ. 4.90లక్షలు, సింహగింపై భక్తుల సెల్‌ఫోన్లు, కెమెరాలు భద్రపరిచేందుకు రూ. 3.52లక్షలు, కొండపైన, కొండదిగువ ఐస్‌క్రీమ్ విక్రయాలు జరిపేందుకు రూ.1.58లక్షలు, గోపాలపట్నంలోని దేవస్థానం స్థలంలో బుధవారం జరిగే సంతలో ఆశీలు వసూలు చేసుకునేందుకు రూ.10,800కి, బుధవారం మినహా మిగతా రోజుల్లో ఆశీలు వసూలుకు రూ.11వేలకు, వరాహ పుష్కరిణి వద్ద కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయానికి రూ.50 వేలకు పాట దారులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈవోలు ఇజిరోతు శ్రీనివాసరావు, ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు తదితరులు ఈ వేలం పాటలు నిర్వహించారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత


వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టులు భర్తీ చేశారు. ఎంపికైన వారికి ఎంపీపీ బోకం సూర్యకుమారి శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. మండలంలోని నారపాడు గ్రామానికి చెందిన రాపర్తి ధరణి, ఆరిపాక గ్రామానికి చెందిన ఆర్. సతీష్ కుమార్‌లను నూతనంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎంపీడీవో రమేష్ నాయుడు, పార్టీ నాయకులు బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి,మండల సముద్రం తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై పోలీసులకు అవగాహన ముఖ్యం

విశాఖ, లీగల్ : పోలీసులు పౌర,నేర శిక్ష స్మృతి పరిధిలోని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పోలీసులు- చట్టాలు అన్న అంశంపై జరిగిన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడారు. నేరంతో ప్రమేయంలేని అమాయకులను అరెస్టు చేస్తే తీవ్రమైన శిక్షకు గురికావలసి వస్తుందని హెచ్చరించారు. నిత్యం చట్టాలపై మూల్యాంకనం అవసరమన్నారు. వివిధ చట్టాలను వివరించారు. న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బులికృష్ణ మాట్లాడుతు పోలీసులు లోక్‌అదాలత్ సేవలను తెలుసుకోవాలన్నారు. మోటారు వాహన చట్టాలు, పరిహారం చెల్లింపు, బాల నేరస్తుల చట్టాలు అన్న అంశాలపై న్యాయ సేవా ప్రాధికార సంస్థ జాతీయ శిక్షకులు రఘు పాత్రుని శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు, నగరంలోని అన్ని పోలీసు స్టేషన్లకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

భయం.. భయం


కూలడానికి సిద్ధంగా ఉన్న దలాయిపాలెం తుపాను భవనం


సగం కూలిన స్వయంభూవరం తుపాను భవనంలో కట్టిన గేదె

- శిథిలావస్థలో తుపాను భవనాలు
- వర్షాకాలం ఆరంభంతో ఆందోళన
- నేలమట్టం చేయాలని వేడుకోలు

పరవాడ: తుపాన్ల నుంచి రక్షణ పొందేందుకు 40 ఏళ్ల కిందట మండలంలో పలు గ్రామాల్లో నిర్మించిన తుపాను భవనాలు శిథిలావస్థకు చేరాయి. అవి ఏ సమయంలో కూలుతాయోనని ఆయా గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. మండల పరిధిలో లోతట్టు గ్రామాలైన కలపాక శివారు స్వయంభూవరం, వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, వెంకటపతిపాలెం గ్రామాల ప్రజలు తుపాను సమయంలో రక్షణ పొందడానికి కేంద్ర ప్రభుత్వం తుపాను భవనాలను నిర్మించింది. కొన్నేళ్ల పాటు వాటిని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాలుగా వినియోగించి భవనాలు శిథిల దశకు చేరడంతో వాటిని నిర్లక్ష్యంగా వదిలేశారు.

పెచ్చులూడిపడుతున్న భవనాలు

ఆలనపాలనా లేక పోవడంతో భవనాలు శిథిలమై పెచ్చులూడి పడుతున్నాయి. ఇటీవల వరుసగా నాలుగు రోజులు కురిసిన వర్షాలకు గోడలు నాని పోయి నీరు లీకైంది.దీంతో ఆ భవనాలు ప్రజలకు ఆశ్రయం కల్పించడం మాటేమో గాని కూలక ముందే నేలమట్టం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే స్వయంభూవరం తుపాను భవనం సగం వరకు కూలిపోయింది. అలాంటి భవనాన్ని స్థానిక రైతులు పశువులను కట్టడానికి ఉపయోగిస్తున్నారు. అలాగే నివాసాల పక్కన నిర్మించిన దలాయిపాలెం తుపాను భవనం కూడా కూలడానికి సిద్ధంగా ఉంది. వెంకటపతిపాలెం భవనం గోడలు నానిపోయి ఏ క్షణంలోనైనా కూలిపోయే స్థితిలో ఉందని స్థానికులు భయపడుతున్నారు. నాయుడుపాలెం, వాడచీపురుపల్లి తుపాను భవనాలు కూడా అదే పరిస్థితిలో ఉన్నాయి. శిథిలమైన భవనాలను తొలగించి తమకు రక్షణ కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

పకడ్బందీగా సామాజిక తనిఖీలు

- ఎంపీడీవో రమేష్‌నాయుడు



సబ్బవరం: మండలంలో 2022-23 సంవత్సరానికి సంబంధించి ఎన్ఆర్ఈజీఎస్ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రమేష్ నాయుడు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. 2022-23 మార్చి వరకూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో రూ.10.46 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. దీనిలో లేబర్ కాంపొనెంట్ కింద ఉపాధి కూలీలకు రూ.8.04 కోట్లు ఖర్చు చేయగా, మెటీరియల్ కాంపొనెంట్‌గా రూ.2.41 కోట్లు చెల్లించినట్టు చెప్పారు. కూలీల సరాసరి వేతనం రూ.230 చెల్లించడం జరిగిందన్నారు. సామాజిక తనిఖీలు బృందాలు ఇప్పటికే చేరుకోవడంతో ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల చివరినాటికి సామాజిక తనిఖీలపై మండల స్థాయిలో విస్తృత సమావేశం సబ్బవరంలో నిర్వహించనున్నట్టు తెలిపారు.

దొంగతనం కేసులో ఏడాది జైలు శిక్ష

- రూ.10 వేల జరిమానా

మల్కాపురం: గతేడాది స్థానిక జవహర్‌నగర్ వద్ద జరిగిన చోరీ కేసులో పట్టుబడిన నిందితుడికి ఏడాది జైలు, రూ. 10 వేల జరిమానా విధిస్తూ మూడో ఏసీఎంఎం మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించి మల్కాపురం సీఐ లూథర్‌బాబు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 60వ వార్డు జవహర్‌నగర్ లో మారుబిల్లి లక్ష్మి అనే మహిళ తన కుటుంబ సభ్యులతో నివాసం ఉంటుంది. అయితే గతేడాది ఈమె ఇంట్లో రాగోలు నిషాంత్(అలియాస్ సొట్టా) అనే వ్యక్తి దొంగతనానికి పాల్పడ్డాడు. తులంన్నర బంగారు ఆభరణం,విలువైన వెండి వస్తువులను దొంగిలించాడు. దీంతో ఆమె క్రైం పోలీసులను ఆశ్రయించింది. దీనిపై హార్బర్ క్రైం సీఐ ఎ.అవతారం ఆదేశాలతో ఏఎస్ఐ శ్రీరామ్ దర్యాప్తు చేశారు. దొంగతనానికి పాల్పడ్డ నిషాంత్ ఇందిరాకాలనీ ప్రాంత వాసి అని గుర్తించారు. దీంతో ఆ వ్యక్తిని అరెస్టు చేసి బంగారం,వెండి వస్తువులు స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించారు. కేసు దర్యాప్తు అనంతరం చార్జ్ షీట్ ఫైల్ చేసి ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. నేరం రుజువు కావడంతో మూడో ఏసీఎంఎం మెజిస్ట్రేట్ ఈ. రాజేంద్రబాబు దొంగతనానికి పాల్పడ్డ నిషాంత్‌కు ఏడాది జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానావిధించారు.

క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయం


ప్రతిజ్ఞ చేస్తున్న ఆరోగ్యకేంద్రం వైద్యులు, సిబ్బంది


అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎన్ఆర్ చక్రవర్తి

సింహాచలం: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలని, సకాలంలో వ్యాధిని గుర్తించి మందులు వాడితే నివారణ సాధ్యమవుతుందని అడవివరం ఆరోగ్యకేంద్రం డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ భాస్కరరావు తెలిపారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని శుక్రవారం అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర వైద్య కళాశాల హౌస్‌సర్జన్లు, ప్రాంతీయ శిక్షణ కేంద్రం నర్సింగ్ విద్యార్థినులతో కలిసి ఆరోగ్యకేంద్రం వైద్యులు, సిబ్బంది అవగాహన ర్యాలీనిర్వహించారు. ఆరోగ్యకేంద్రం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు సాగింది. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా క్షయవ్యాధి ప్రభావం, వ్యాధి సోకే విధానం గురించి డాక్టర్ భాస్కరరావు, ఊపిరితిత్తుల వ్యాధి నిపుణురాలు డాక్టర్ రాణి వివరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఆరోగ్యకేంద్ర శిక్షకులు ఎస్.వి.రమణ, ఆరోగ్యకేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ శివరామకృష్ణ, పర్యవేక్షక సిబ్బంది పార్వతీశం, ఎల్మాదేవి, నర్సింహారావు, నారాయణరావు, లక్ష్మీనరసమ్మ, భవాని పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

సబ్బవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ టీబీ డే సందర్భంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎన్ఆర్ చక్రవర్తి మాట్లాడుతూ రెండు వారాలకు పైగా దగ్గు,జ్వరం వస్తే క్షయ కావచ్చన్నారు. అదేవిధంగా ఆకలి తగ్గడం,బరువు తగ్గటం, రాత్రిపూట చెమటలు పట్టడం,కఫంలో రక్తపు చారలు కనిపిస్తున్నా టీబీ కావడానికి అవకాశం ఉందని తెలిపారు. క్షయను కఫం, ఎక్సరే ద్వారా కూడా నిర్ధారించవచ్చని వివరించారు. ఈ పరీక్షలు ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా చేస్తారని చెప్పారు. టీబీ సోకిన వ్యక్తికి ఆర్నెల్ల పాటు ఉచిత మందులు రోగి ఇంటి వద్దకే ఆశా కార్యకర్తల ద్వారా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆశా,ఎంపీహెచ్ఈవో ఏసుదాసు, హెచ్ఎస్ రాంబాబు, ఐసీటీసీ కౌన్సిలర్ రాజశేఖర్,ఎల్‌టీలు పద్మ,నీలిమ,స్టాఫ్ నర్స్ ప్రియ,ఫార్మసిస్ట్ జానకి పాల్గొన్నారు.

‘దేశ ప్రజలే తగిన బుద్ధి చెబుతారు’


కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఎన్నో కార్మికుల కుటుంబాలు ఆధారపడి ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తే దేశ ప్రజలే కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 771వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బడా బాబుల బ్యాంకుల రుణాలను మాఫీ చేసే కేంద్ర ప్రభుత్వం, పైసాతో సహా తీసుకున్న రుణాలకు వడ్డీలు కడుతున్న స్టీల్ ప్లాంట్ రుణాలను మాఫీ చేయకపోగా, రా మెటీరియల్స్ కొనుక్కోవడానికి అదనపు రుణాలు పొందేందుకు అనుమతి లేకుండా అడ్డుపడడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకుకోవాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ లావాదేవీలపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న డీజీఎం గణపతి

అక్కిరెడ్డిపాలెం: బ్యాంక్ లావాదేవీలపై కార్మికులు అవగాహన కలిగి ఉండాలని డీజీఎం సీహెచ్. గణపతి సూచించారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లోని కార్మికులకు ఆర్థిక లావాదేవీలపై విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) భవనంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఐ అధికారులు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు లేబర్ కమిషన్ ద్వారా మీ శ్రమ్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. దీంతో కార్మికులు ప్రమాదాలకు గురైతే ఇన్సూరెన్స్ నగదు బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందన్నారు. నగరంలో త్వరలో జరగనున్న జి - 20 శిఖరాగ్ర సమావేశంలో ఆర్‌బీఐ భాగస్వామ్యంతో పాల్గొంటుందన్నారు. బ్యాంక్ ఖాతాల్లో పొదుపు, ప్రణాళిక, డిజిటల్ ఆర్థిక లావాదేవీలపై వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ ఏజీఎం నాగప్రవీణ్, అంజనేయులు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శర్మ, ఆర్‌బీఐ అధికారి రోహన్ తదితరులు పాల్గొన్నారు.

‘మానవాభ్యున్నతికి ఉపయుక్తంగా వ్యవస్థలు’


సదస్సు సంచికను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

ఏయూ క్యాంపస్: మానవాభివృద్ధికి ఉపయుక్తంగా సమాజ వ్యవస్థలు పని చేయాలని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. శుక్రవారం ఏయూ సోషల్ ఎక్స్‌క్లూజన్ ఇంక్లూజివ్ పాలసీ స్టడీస్(సీఎస్ఎస్ఈఐపీ)లో నిర్వహిస్తున్న 'సోషల్ ఇంక్లూజివ్, ఈక్విటీ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ డిసెడ్వాంటేజ్ కమ్యూనిటీస్ ఇన్ ఇండియా'రెండు రోజుల సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో ప్రతి వ్యక్తి ప్రగతికి, అభ్యున్నతికి దోహదపడే పథకాలు ఉన్నాయన్నారు. బరంపురం వర్సిటీ అడ్జంక్ట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.కె.పరీచా మాట్లాడుతూ గాంధీజీ, అంబేడ్కర్‌ల ఆలోచన విధానాలు అట్టడుగు వర్గాల అభ్యున్నతికి దోహదకారిగా నిలిచిన విధానం వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా అసమానతలు దర్శనమిస్తున్న విధానాన్ని వివరించారు. సామాజిక వేర్పాటుకు పేదరికం, కులం, అణచివేత కారణాలుగా నిలుస్తున్నాయన్నారు. కేంద్రం సంచాలకుడు ఆచార్య పి.సుబ్బారావు మాట్లాడుతూ విద్య, వైద్యం వంటివి అందరికీ సమానంగా అందాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సులో డాక్టర్ ఎస్.బాబా వల్లి, డాక్టర్ బి.శివరామకృష్ణ, 75 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ బాధిత గ్రామాలను ఆదుకోండి

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్



పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ బాధిత గ్రామాలను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఎన్టీపీసీ విడుదల చేస్తున్న కాలుష్యంతో కలపాక శివారు స్వయంభూవరం, పిట్టవానిపాలెం గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నట్లు తన దృష్టికి రావడంతో వైద్య ఆరోగ్య శాఖతో ఆయా గ్రామాల్లో సర్వే నిర్వహించి నివేదిక తీసుకోవడం జరిగిందని చెప్పారు. ఆ నివేదికలో పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యం కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నట్లు స్పష్టమైందని చెప్పారు. కాలుష్యం వల్ల పంట ఫలసాయాలు కూడా దెబ్బతింటున్నాయని అధికారులు గుర్తించారన్నారు. కాలుష్యంతో అవస్థలు పడుతున్న ఆయా గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


తిరువీధిలో అమ్మవార్లు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు రఘునాథ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా తిరువీధి

సింహాచలం: సింహగిరిపై సింహవల్లీ తాయారు, సువర్ణ అమ్మవారికి శుక్రవారం తిరువీధి వైభవంగా జరిగింది. అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో అధిష్టంపజేసి సాయంత్రం ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించి విశేషంగా హారతులు అందజేశారు

ట్రాన్స్‌పోర్టు లారీలకు జీపీఎస్ వ్యవస్థ తప్పనిసరి


లారీ యజమానులతో సమావేశమైన డీసీపీ-2 ఆనందరెడ్డి

అల్లిపురం: ట్రాన్స్‌పోర్టు లారీలన్నింటిలో తప్పనిసరిగా జీపీఎస్ వ్యవస్థ అమర్చాలని, లోడింగ్ పాయింట్ నుంచి గమ్యస్థానం చేరేంత వరకు సంబంధిత లారీ ట్రాన్స్‌పోర్టు వారు సదరు లారీల ట్రాకింగ్ డేటా భద్రపరచాలని జోన్-2, డీసీపీ కె. ఆనందరెడ్డి కోరారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన లారీ ట్రాన్స్‌పోర్టు సంఘాల యాజమాన్యాలతోను, స్టీవ్ డోరింగ్ కంపెనీల ప్రతినిధులతో పోర్టుట్రస్ట్ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ కేటాయించిన యార్డుల్లో సంబంధిత సంస్థలు తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, కంపెనీ యాజమాన్యాలు సూపర్‌వైజర్లను, సెక్యూరిటీ గార్డులను నియమించుకునే క్రమంలో ఆయా సంస్థలు గత చరిత్ర, నేరచరిత్రను తప్పక పరిగణనలోకి తీసుకోవాలన్నారు. స్టీవ్ డోర్స్ కంపెనీ వారు జీపీఎస్ ఉన్న వాహనాలను మాత్రమే లోడింగ్‌కు అనుమతించాలని కోరారు. పోర్టులో షిప్ నుంచి లోడ్ అన్‌లోడ్ చేసిన మెటీరియల్ యార్డ్‌కు పంపించే సమయంలో ప్రతి లారీకి రశీదు అందించి అన్‌లోడ్ అయిందా లేదా అని తనిఖీ చేసుకోవాలన్నారు. వేయింగ్ బ్రిడ్జి వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చాలని యజమానులకు తెలిపారు. ఈ సమావేశంలో హార్బర్ ఏసీపీ, హార్బర్ సీఐ, పోర్టుట్రస్ట్ ట్రాఫిక్ మేనేజర్ పాల్గొన్నారు.

వడివడిగా సంద్రం వైపు...


పెదనాగమయ్యపాలెం వద్ద సముద్రంలోకి వడివడిగా కదులుతున్న తాబేలు పిల్లలు


తాబేళ్లను ఉంచిన బుట్టలతో మత్స్యకారులు

పెదనాగమయ్యపాలెం వద్ద సముద్రంలోకి 640 తాబేలు పిల్లలు

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం తీరంలో అటవీశాఖ ఆధ్వర్యంలో సంరక్షించిన తాబేలు గుడ్లు పిల్లలుగా మారడంతో శుక్రవారం ఉదయం పెదనాగమయ్యపాలెం, చినసాగమయ్యపాలెం మత్స్యకారులు, పంచాయితీ పెద్దల ఆధ్వర్యంలో సముద్రంలోకి వదిలారు. సముద్ర ఘోష వినిపించిన వైపు తాబేలు పిల్లలు వడివడిగా సాగిపోయాయి. స్థానిక మత్స్యశాఖ ప్రతినిధులు తోట మసలయ్య, గరికిన లక్ష్మణ, దూడ ధనంకొండ తదితరులు మాట్లాడుతూ తీరంలో తాబేళ్ల గుడ్లు పెట్టిన తర్వాత మత్స్యకారులు ఇసుకలో అడుగున్నర లోతు తవ్వి సేకరిస్తారన్నారు. ప్రత్యేకంగా వెదురు కర్రలతో తడికెలు నిర్మించి వాటిని భద్రపరుస్తారన్నారు. దీనివల్ల పక్షులు, ఇతర జంతువుల బారినపడకుండా ఉంటాయన్నారు. 50 రోజుల తర్వాత గుడ్ల నుంచి పిల్లలు బయటకు వచ్చిన తర్వాత సూర్యోదయం వేళ బుట్టల్లో భద్రంగా తీసుకొచ్చి తీరంలో వదిలితే అలల శబ్దానికి వడివడిగా తాబేళ్లు సముద్రంలో కలసిపోతాయన్నారు. శుక్రవారం 640 తాబేలు పిల్లలను సముద్రంలో వదిలినట్టు వారు తెలిపారు. ఇంకా మరిన్ని గుడ్లు తీరంలో ఉన్నాయని తెలిపారు.

నేడు జాబ్ మేళా


కంచరపాలెంలో ప్రభుత్వ ఉపాధి కార్యాలయం

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ ఉపాధి కార్యాలయం(క్లరికల్) ప్రాంగణంలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక జరగనుందన్నారు.

ఇవీ వివరాలు..

- హెటిరోల్యాబ్స్ లిమిటెడ్‌లో 200 జూనియర్ కెమిస్ట్ పోస్టులకు ఏదైనా డిగ్రీ అర్హత కలిగి 20-26 ఏళ్ల లోపు వయసు గల వారు అర్హులు. నెలకు రూ.22,800 జీతం ఇస్తారు.
- పొలగాని సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేటు కంపెనీలో 30 ప్రాసెస్ అసిస్టెంట్ పోస్టులకు డిగ్రీ/పీజీ/ఏదైనా డిప్లొమా అర్హత కలిగి 20-25 ఏళ్ల లోపు వయసు ఉండాలి. నెలకు రూ.12,000 జీతం ఉంటుంది.
- స్టీల్ సిటీ సెక్యూరిటీ లిమిటెడ్(సీతంపేట-విశాఖపట్నం)లో 20 టెలీకాలర్స్, 20 మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, 20 కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు ఏదైనా డిగ్రీ, 25 ఏళ్ల లోపు వయసు గల వారు అర్హులు. నెలకు జీతం రూ.12,000.
- క్లోవ్ టెక్నాలజీస్‌లో 15 ఆటో క్యాడ్ పోస్టులకు బీటెక్(సీఎస్ఈ), 22-27 ఏళ్ల వయసు మధ్య ఉన్న వారు అర్హులు. జీతం 13,500. ఇదే సంస్థలో డిప్లొమా లేదా ఏదైనా బీటెక్ చేసిన వారికి డెవలపర్స్ ఉద్యోగానికి అవకాశం ఉంది. నెలకు రూ.13,500 జీతం ఉంటుంది.
- పేజెస్ సంస్థలో ప్రొగ్రాం కో ఆర్డినేటర్, రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, డాటా సోర్సింగ్, కమ్యూనికేషన్ పోస్టులను భర్తీ చేస్తారు. సైన్స్ డిగ్రీ/బీ ఫార్మసీ/ఎం ఫార్మసీ/బీఎస్‌సీ/ఎంఎస్సీ/బీటెక్ కంప్యూటర్స్ కోర్సులు చేసి 30 ఏళ్ల వయసు లోపు ఉన్న వారు అర్హులు. విశాఖలో రూ.16,000, హైదరాబాద్‌లో రూ.18,000 జీతం ఇస్తారు.
- ట్రస్ట్ సర్వీసెస్‌లో ఫిట్టర్, వెల్డర్, ప్యాబ్రికేట్, గ్రైండర్స్ హెల్పర్స్ 10 పోస్టులకు ఐటీఐ చదివి 18-48 ఏళ్ల వయసు గల వారు అర్హులు. నెలకు రూ.15,000 నుంచి రూ.25,000 వరకు జీతం ఉంటుంది.
- సువర్ణభూమి సంస్థలో మార్కెటింగ్ మేనేజరు పోస్టుకు బీటెక్/ఎంబీఏ అర్హత కలిగి 18-36 ఏళ్ల వయసు గల వారిని తీసుకుంటారు. పది పోస్టులు ఉన్నాయి. నెలకు రూ.17,000 జీతం. ఇదే సంస్థలో 10 టెలికాలర్ ఉద్యోగాలకు 18-36 ఏళ్ల వయసు గల వారు దరఖాస్తు చేసుకోవచ్చు. జీతం రూ.9,000. అభ్యర్థులు నేరుగా కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయానికి శనివారం ఉదయం 10 గంటలకు హాజరు కావచ్చు. ఆసక్తి గల వారు ncs.gov.in లో పేర్లు నమోదు చేసుకోవాలి.

ఆధ్యాత్మికతతో శాంతియుత జీవనం

ఏయూ క్యాంపస్: కోపం వల్ల కలిగే నష్టాలను అన్ని మత గ్రంథాలలో ప్రస్తావించారని విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం అధిపతి ఉమర్ అలీషా తెలిపారు. శుక్రవారం గాంధీయన్ స్టడీస్ సెంటర్‌లో 'కోప రహిత సమాజం'అనే అంశంపై ఆయన మాట్లాడారు. శాంతియుత జీవితాన్ని గడపడానికి ఆధ్యాత్మికత ఒక సాధనంగా ఉపకరిస్తుందని చెప్పారు. డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ రచించిన 'అక్రోధ్యపా-కోపం లేని జీవితం'పుస్తకాన్ని ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున వర్సిటీ పూర్వ వీసీ ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్, ప్రొఫెసర్ పి.ఎస్.దీక్షిత్, డాక్టర్ రామకృష్ణ, గాంధేయవాది రావిప్రోలు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.